అంబర్‌పేట అభివృద్ధే లక్ష్యం



నింబోలిఅడ్డాలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గ సర్వతో ముఖాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బుధవారం కాచిగూడ డివిజన్ నింబోలిఅడ్డాలో రూ. 31 లక్షల వ్యయంతో నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ పనులను, రూ. 1.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న మంచినీటి పైప్‌లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మంచినీరు, డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఆధునికీకరించి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి, సీవరేజ్ సమస్యల పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసే మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటుతో మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. జలమండలి మేనేజర్ షాకీర్, బీఆర్‌ఎస్ నేతలు ఎర్ర భీష్మదేవ్, దాత్రిక్‌నాగేందర్ బాబ్జీ, బద్దుల ఓంప్రకాష్ యాదవ్, సరిత, ప్రతిభ, లావణ్య, బీజేపీ నేతలు సుభాష్ పటేల్, బి.భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, కృష్ణ కుమార్, మల్లికార్జున్, ఆర్.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరుల సమస్యల పరిష్కారానికి మంత్రి పొన్నం సానుకులం



మంత్రి పొన్నంకు జ్ఞాపికను అందజేస్తున్న నేతలు

చిక్కడపల్లి: వడ్డెర భవన సముదాయ ట్రస్ట్ తెలంగాణ ఆధ్వర్యంలో బుధవారం బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించినందుకు ట్రస్ట్ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ జెరిపేటి సత్యనారాయణ, వైస్ చైర్మన్ ఎత్తిరి అంతయ్య మాట్లాడారు. వడ్డెరులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లామని, పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించాలని తెలిపారు. ట్రస్ట్ డైరెక్టర్ ఓర్సు కృష్ణయ్య, మక్కల వెంకటేష్, వంటిపులి శ్రీను, పల్లపు నారాయణ ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు



పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: రాంనగర్ చౌరస్తా సమీపంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్‌లోని రాంనగర్ చౌరస్తా సమీపంలో చేపట్టిన డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పైప్‌లైన్ నిర్మాణానికి సీసీ రోడ్డు తవ్వేందుకు అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో నిర్మాణ పనులలో జాప్యం జరిగిందన్నారు. జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు సమన్వయంతో పని చేస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. హోలి ట్రినిటీ హై స్కూల్ వీధిలో డ్రైనేజీ రోడ్డు నిర్మాణ పనులు త్వరలో చేపడతామని స్థానికులకు హామ ఇచ్చారు. బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, ముషీరాబాద్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు డి.శివముదిరాజ్, సుధాకర్‌గుప్తా, నేత భాస్కర్, పూస గోరఖ్‌నాథ్, ముదిగొండ మురళి, అరుణ్, రవియాదవ్, అనిల్‌కుమార్, రాజ్‌కుమార్, రవిచారి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అందుబాటులోకి కమ్యూనిటీ హాల్



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి రూ. 65 లక్షల ప్రత్యేక నిధులతో చేపట్టిన అశోక్‌నగర్ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ నూతన భవన నిర్మాణ పనులను కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వారం రోజులలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కమ్యూనిటీ హాల్ భవనాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. బీజేవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రత్నాసాయిచంద్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, సత్తిరెడ్డి, ఆకుల సురేందర్, సురేష్, నవీన్‌కుమార్, ఆనంద్‌రావు, ఆకుల అభిషేక్, అశోక్‌నగర్ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రామ్మూర్తి, కార్యదర్శి భాసాని సర్వప్రకాశ్, పద్మావతి, ఐ.ఎస్.ఎస్.మూర్తి, సభ్యులు రమేశ్, నాగలక్ష్మీ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో మల్లన్న జాతర విజయవంతం



అంజిరెడ్డిని సన్మానిస్తున్న వివిధ పార్టీల నేతలు, భక్తులు

ముషీరాబాద్: అందరి సహకారంతో శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి (శ్రీ మల్లన్న) జాతర మహోత్సవం విజయవంతంగా ముగిసిందని ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి తెలిపారు. వారం రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించిన శ్రీ మల్లన్న జాతర మహోత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విజయవంతం చేసినందుకు ఆలయ కమిటీ ట్రస్టీ అంజిరెడ్డిని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, భక్తులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం స్వామి వారి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తూ ప్రజలలో ఆధ్యాత్మిక భావం పెంపొందిస్తున్నట్లు తెలిపారు. వివిధ పార్టీల నాయకులు తుమ్మరాజు, గోక నవీన్, మురళీ, అరుణ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ. లక్షల ప్రజాధనం..

ట్యాంకుల్లో పోశారు..!

- నిరుపయోగంగా సింటెక్స్ ట్యాంకులు
- మరమ్మతులకు నోచుకోని చేతిపంపులు
- మరమ్మతులు చేస్తే తీరనున్న ప్రజల దాహార్తి



నింబోలిఅడ్డాలో నిరుపయోగంగా సింటెక్స్ ట్యాంక్, హ్యాండ్ బోర్

కాచిగూడ: వేసవిలో మంచినీటి ఎద్దడి నివారించేందుకు గాను జలమండలి అధికారులు వేసవి కార్యచరణ ప్రణాళిక రూపొందించారు. ఇంత వరకు బాగానే ఉంది. కొన్నేళ్లుగా కాచిగూడ డివిజన్‌లో నిరుపయోగంగా ఉన్న సింటెక్స్ ట్యాంకుల గురించి విస్మరించినట్లున్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాలలో కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన సింటెక్స్ ట్యాంకులు పనికిరాకుండా ఉన్నాయి.

- కాచిగూడ, నింబోలిఅడ్డా, లింగంపల్లి తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సింటెక్స్ ట్యాంకులలో నీళ్లు నిండం లేదు. దీనివల్ల స్థానికులకు ఎలాంటి ఉపయోగం లేదు. ఒక వేళ ఈ ప్రాంతాలలో స్థానికంగా మంచినీటి సమస్యలు తీవ్రంగా లేకపోతే మంచినీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు తరలించడం ద్వారా ఉపయోగకరంగా ఉంటుంది.
- అధికారులు వీటి గురించి పట్టించుకోవడమే వదిలేశారు. ఫలితంగా లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన సింటెక్స్ ట్యాంకులు నిరుపయోగంగా మారి స్థానికుల అవసరాలు తీర్చలేకపోతున్నాయి.
- ఈ ట్యాంకులలో సక్రమంగా నీటిని నింపడం ద్వారా స్థానికంగా తాత్కాలికంగా మంచినీటి సమస్యను పరిష్కరించవచ్చు. నీటి ట్యాంకర్లు లేని ప్రాంతాలలో ఏర్పాటు చేయడం ద్వారా స్థానికులకు ఉపయోగకరంగా ఉంటుంది.
- కొన్ని ప్రాంతాల్లో అడపాదడపా మంచి నీళ్లు నింపుతున్నారు. ఈ ట్యాంకులు స్థానికుల అవసరాలు తీరుస్తున్నప్పటికీ నిరంతరం నింపకపోవడం వల్ల సమస్యలు తప్పడం లేదు. జలమండలి అధికారులు సింటెక్స్ ట్యాంకులపై దృష్టి సారించాల్సిన అవసరముందని స్థానికులు కోరుతున్నారు.



చూసేందుకే.. చుక్క రాల్చవు...

వేసవి ముంచుకొస్తున్నది. మంచినీటి ఎద్దడి రోజురోజుకు తీవ్రం అవుతోంది. నీటి ఎద్దడి నివారణకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంలో మాత్రం జలమండలి నిర్లక్ష్యం ప్రదర్శిస్తుంది. ఫలితంగా రాబోయే రోజుల్లో మంచినీటి ఎద్దడి తీవ్రమయ్యే అవకాశం ముంది. చేతి పంపులు (బోరింగ్) మరమ్మతులలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటం వల్ల సమస్యలు రోజురోజుకు జటిలమవుతున్నాయి.

- కాచిగూడ డివిజన్‌లోని పలు ప్రాంతాలలో చేతి పంపులు నిరుపయోగంగా మారాయి. చాలా నెలల నుంచి ఇవి పనికి రాకుండా మారాయి. కొన్ని బోరింగ్‌లైతే భూమిలోకి కూరుకుపోయాయి. మరికొన్ని దేనికీ ఉపయోగపడకుండా తయారయ్యాయి.
- ప్రస్తుతం ఉన్న బోరింగ్‌లకు మరమ్మతులు చేయడం ద్వారా వీటిని అందుబాటులోకి తీసుకురావచ్చు. జలమండలి అధికారులు ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించకోవడం వల్ల వేసవిలో నీటి ఎద్దడి తీవ్రమయ్యే అవకాశముంది. దీనిని దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు చేతి పంపుల మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మతోన్మాద శక్తులను అరికట్టాలి

లిబర్టీ: విశ్వవిద్యాలయాల్లో దళిత విద్యార్థులపై జరుగుతున్న దాడులు, వేధింపులను అరికట్టాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ డిమాండ్ చేశారు. వేధింపులు భరించలేక సెంట్రల్ యూనివర్సిటీలో పరిశోధన విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకున్నారని గుర్తుచేస్తూ... ఆత్మహత్యకు బాధ్యులైన వారిని ఇంత వరకు కూడా శిక్షించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధన విద్యార్థి రోహిత్ వేముల వర్ధంతి సభ బుధవారం మాల మహానాడు కార్యాలయంలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... 2015 సంవత్సరంలో అగ్రకుల మతోన్మాద శక్తుల వేధింపుల కారణంగానే ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. రోహిత్ వేముల పరిశోధన విద్యార్థిగా యూనివర్సిటీలో చురుకైన పాత్ర పోషించే వారని అది జీర్ణించుకోలని మత శక్తులు వేధింపుల వల్ల వల్లనే నిండు జీవితాన్ని కోల్పోవాల్సి వచ్చిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



ఖైరతాబాద్: నూతనంగా ఎన్నికైన హైదరాబాద్ సిటీ టీఎన్‌జీవో అధ్యక్షుడు కె.శ్రీకాంత్, సెక్రటరీ హరికృష్ణలతో పాటు రాష్ట్ర టీఎన్‌జీవో సెక్రటరీ ఎం.జగదీశ్వర్‌ను బుధవారం సన్మానించారు. ఖైరతాబాద్ పాఠ్యపుస్తక ముద్రణాలయం జేఏసీ సభ్యులు కన్వీనర్ డి.బాల్‌కుమార్, చైర్మన్ విశ్వసేన, కో కన్వీనర్ వినోద్‌కుమార్, జాయింట్ సెక్రటరీ ఎం.నరేష్, కురుమన్న, శ్రీరాములు, దయానంద్, రాఘవేందర్ తదితరులు కలిసి సన్మానించారు.

వైభవంగా అఖండ శ్రీరామ నామ స్మరణ

బంజారాహిల్స్: అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12 అయ్యప్ప స్వామి ఆలయ సముదాయంలోని శ్రీకృష్ణ గోశాల ఆవరణలో అఖండ శ్రీరామ నామ స్మరణ వైభవంగా జరుగుతోంది. హనుమాన్ జన్మోత్సవ సమితి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా 24 గంటలు రామనామ జపం చేస్తున్నారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్గనైజర్లు సతీష్ కుమార్ జాదు, లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ చైర్మన్ జస్మత్ పటేల్ తదితరులు పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. ఈ నెల 23 వరకు కొనసాగే ఈ అఖండ రామనామ స్మరణలో 15 మంది వేద పండితులు పాల్గొని నిరంతరాయంగా భజనలు చేస్తున్నారు. గుజరాతీ ఏక్తా మహోత్సవ్ చైర్మన్, లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ చైర్మన్ జస్మత్‌పటేల్ మాట్లాడుతూ... రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో హారతి, మహా హారతి అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు.

కేంద్రంలో మరోసారి అధికారం బీజేపీదే: గౌతంరావు



మాట్లాడుతున్న డాక్టర్ గౌతంరావు

కాచిగూడ: ప్రతి ఇంటా జనవరి 22వ తేదీన దీపావళి పండగలా సంబరాలు జరుపుకోవాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు పిలుపునిచ్చారు. బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అయోధ్యలో రామమందిర నిర్మాణం కోసం ఎంతోమంది త్యాగాలు చేశారన్నారు. అయోధ్యలో రామమందిరాన్ని నిర్మించడంతో హిందువుల కోరిక నెరవేరిందని గౌతమ్‌రావు పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపుమేరకు దేవాలయాలను శుభ్రం చేయాలని ఆయన కోరారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ మరోసారి కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని గౌతంరావు ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ నేతలు శ్యామ్‌సుందర్ గౌడ్, నాగూరావు నమోజీ, వీరెల్లి చంద్రశేఖర్, కృష్ణగౌడ్, మేకల సారంగపాణి, పవన్ పాల్గొన్నారు.

సేవాభావాలను అలవర్చుకోవాలి



ముషీరాబాద్: ప్రతి ఒక్కరూ సేవా భావాలను అలవర్చుకొని ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని బీజేవైఎం మహంకాళీ జిల్లా అధ్యక్షుడు మద్దురి శివాజీ అన్నారు. బుధవారం బీజేవైఎం అధికార ప్రతినిధి బుర్ర రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ముషీరాబాద్‌లోని రెయిన్‌బో హోమ్ అనాథ ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన మద్దురి శివాజీ అనాథ పిల్లలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సామాజిక బాధ్యతతో అనాథ పిల్లలకు తమవంతు సహాయ సహకారం అందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శక్తిసింగ్, రాజునేత, అనిల్‌కుమార్, లడ్డూ, బాబీ తదితరులు పాల్గొన్నారు.

'రజనీ గంగాధర్ రచనలు' ఆవిష్కరణ



చిక్కడపల్లి: పూసల ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ నిర్వహణలో శ్రీ త్యాగరాయ గానసభలోని కళాలలిత కళావేదికపై ప్రముఖ రచయిత్రి పూసల రజనీ గంగాధర్ రచించిన సామెత కథలు కథాసంపుటి, పద్య సౌరభం పద్య సంపుటి ఆవిష్కరణ సభ బుధవారం రాత్రి జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ కవి జల్ది విద్యాధరరావు సంపుటాలను ఆవిష్కరించి మాట్లాడారు. రజనీ గంగాధర్ పలు సాహితీ ప్రక్రియల రచనలో ప్రతిభావంతుడు అని ప్రశంసించారు. వాడుకలో తెలుగులో ఉన్న సామెతలను కథల రూపంలో వెలువరించి వాటిలోని అంతరార్థం తెలిపారని అన్నారు. అధ్యక్షత వహించిన సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు మాట్లాడుతూ... తెలుగు వారి ఆరాధ్య గాయకుడు ఘంటసాల జీవిత కథను వాహికథగా పాడుకునే విధంగా రచించారని అభినందించారు. బండి శంకరం, విరజానంద, జయప్రకాష్ తదితరులు పాల్గొనగా పూసల నరేష్ స్వాగతం పలికారు ముందుగా సాహితీవేత్త పులివర్తి కృష్ణమూర్తి, అధ్యక్షతన కవి పెద్దూరి వెంకటదాసు నిర్వహణలో కవి సమ్మేళనం జరిగింది. తంగిరాలలో చక్రవర్తి, బాలగంగాధరయ్య, అబ్దుల్ రషీద్ తదితరులు స్వీయ కవితలు చదివారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా టీఎస్ఎస్పీడీసీఎల్-11 కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏడీఈ విజయ్‌భాస్కర్ తెలిపారు. అంబర్‌పేట్ ఫీడర్ పరిధిలో అంబర్‌పేట్, ఎంసీహెచ్ కాలనీ, ఆకాష్‌నగర్, రెడ్ బిల్డింగ్, రామకృష్ణానగర్, వినాయక్ నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. అయ్యప్ప టెంపుల్ ఫీడర్ పరిధిలోని బతుకమ్మకుంట, సాయిదత్త నర్సింగ్ హోమ్, టెలిఫోన్ ఎక్స్‌చేంజ్, శివం, మల్లికార్జుననగర్, ఎరుకల బస్తీ తదితర ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, గోల్నాక ఫీడర్ పరిధిలో జైస్వాల్ గార్డెన్, మారుతీనగర్, తిరుమలనగర్, తిలక్‌నగర్ ఫీడర్ పరిధిలోని చే నెంబర్ క్రాస్ రోడ్, అంబర్‌పేట మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏడీఈ వివరించారు.

లోయర్‌ట్యాంక్ బండ్ పరిధిలో...

ముషీరాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతు పనుల కారణంగా గోశాల, ఇందిరా పార్కు ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లోయర్ ట్యాంక్‌బండ్, అంబేడ్కర్ భవన్, గోషాల, రజాక్ కాలనీ, డీబీఆర్ మిల్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సైఫాబాద్ ఏడీఈ తెలిపారు. కవాడిగూడ, ఇందిరా పార్కు ఫీడర్ పరిధిలోని గురువారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మ్యారియట్ హోటల్, కవాడిగూడ పెట్రోల్ బంక్, కొత్త బజార్, హనుమాన్ టెంపుల్, పద్మశాలీ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని ఏడీఈ ఎం.ప్రేమానంద్‌సాయ్ తెలిపారు.

22న సెలవు ప్రకటించాలి

నల్లకుంట: ఉత్తర ప్రదేశ్‌లో ఈ నెల 22న అయోధ్య ఆలయ ప్రారంభం, బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆ రోజు సెలవు ప్రకటించాలని బీజేపీ ఎండోమెంట్ సెల్ కన్వీనర్ అన్నావఝ్జల సూర్య ప్రకాశ్ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. అయోధ్య రాముడి ప్రాణ ప్రతిష్ఠాపన నేత్ర పర్వంగా జరగనుండటం ద్వారా హిందువుల 500 ఏళ్ల ఆకాంక్ష నెరవేరబోతోందన్నారు. దీని కోసం కోట్లాది మంది హిందువులు ఎదురుచూస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం రోజు ప్రపంచంలోని చాలా దేశాలు సెలవు ప్రకటించాయని తెలిపారు. ఇది ప్రపంచంలోని హిందువులందరి పండుగ అని, ఆ రోజు సెలవు ప్రకటించి హిందువుల మనోభావాలను గౌరవించాలన్నారు.

అన్నదానం...

నల్లకుంట: ఉత్తర ప్రదేశ్‌లో ఈ నెల 22న అయోధ్య ఆలయ ప్రారంభం, బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆ రోజు అన్ని రామాలయాల్లో ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టాలని ప్రముఖ సంఘ సేవకుడు, బీఆర్ఎస్ నాయకుడు, బిల్డర్ ప్రవీణ్ రామ భక్తులను కోరారు. తన వంతుగా ఆ రోజు నల్లకుంటలోని రామాలయాల్లో ప్రసాద వితరణతో పాటు ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వద్ద మధ్యాహ్నం 1.30 గంటలకు అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సౌజన్యకు జాతీయ యువజన అవార్డు



సి.హెచ్ సౌజన్య

కాచిగూడ: స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల నేపథ్యంలో నవభారతి నిర్మాణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా అందించే జాతీయ యువజన అవార్డు-2024కు సి.హెచ్.సౌజన్యను ఎంపిక చేసినట్లు ఆ సంస్థ అధ్యక్షుడు బత్తుల హేమంత్ తెలిపారు. ఎనమిదేళ్లుగా ఎన్‌సీసీ, వివిధ సంస్థల నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలలో పాల్గొంటూ శాంతి, మత సామరస్యం, పర్యావరణ పరిరక్షణ, జాతీయ సమైఖ్యత, విద్యార్థుల సంక్షేమ అభివృద్ధికి సౌజన్య అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 19వ తేదీన బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో నిర్వహించే కార్యక్రమంలో సౌజన్యకు జాతీయ యువజన అవార్డును అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఆంజనేయ స్వామి ఆలయ హుండీ లెక్కింపు



చిక్కడపల్లి: వివేక్ నగర్‌లోని ప్రసిద్ధిచెందిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపు జరిగింది. దేవాలయ కార్యనిర్వహణాధికారి మాచర్ల దేవనాథం, ఇన్‌స్పెక్టర్ సురేఖ పర్యవేక్షణలో హుండీలోని కానుకలను లెక్కించారు. ఈవో దేవనాథం మాట్లాడుతూ నెల రోజులకు గాను రూ. 1,12,315 ఆదాయం వచ్చిందని తెలిపారు. అర్చకులు కె.కృష్ణమూర్తి, కందాళ వెంకటాద్రి, ఎస్‌బీబీఎస్ ఆచార్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 1, 2వ తేదీల్లో 'వర్కింగ్ కమిటీల' సమావేశాలు

లిబర్టీ: భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్న ఆల్ ఇండియా కాన్ఫడరేషన్ ఆఫ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఏఐటీయూసీ వర్కింగ్ కమిటీ సమావేశాలు ఫిబ్రవరి 1, 2వ తేదీల్లో జరగనున్నాయని జాతీయ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే వర్కింగ్ కమిటీ సమావేశాలు బెంగళూరులోని సిరిపూర్ పార్క్ రోడ్డు శేషాద్రిపురంలో జరుగుతాయన్నారు. తొలి రోజైన ఫిబ్రవరి 1వ తేదీన ఉదయం 11 గంటలకు బహిరంగ సభ ఉంటుందన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు వర్కింగ్ కమిటీ సమావేశాలు ప్రారంభమై 2వ తేదీ నాలుగు గంటలకు సమావేశాలు ముగుస్తాయన్నారు.

రోహిత్ వేములకు నివాళి

హిమాయత్‌నగర్: దళిత, బహుజన విద్యార్థి పోరాట యోధుడు రోహిత్ వేముల త్యాగాలను వృథా కానివ్వద్దని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్ట్ న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపు నిచ్చారు. రోహిత్ వేముల వర్ధంతిని డీబీపీ, దళిత బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లోని పార్టీ కేంద్ర కార్యయంలో నిర్వహించారు. రోహిత్ వేముల చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కేంద్రంగా దేశవ్యాప్తంగా విద్యాలయాల్లో దళిత బహుజన విద్యార్థులు ఎదురుకుంటున్న సమస్యలు పరిష్కారానికి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థి సమాజం ఐక్యత కోసం, దళిత విద్యార్థుల మీద జరుగుతున్న కుల వివక్షత, అణిచివేత, దాడులకు వ్యతిరేకంగా బలమైన పోరాటాలు చేశారని గుర్తుచేశారు. దళిత బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఇటీకాల గణేష్, డిప్యూటీ కో ఆర్డినేటర్ తిరుడు రవి, డీబీపీ రాష్ట్ర కార్యదర్శి బీరం సతీష్ కుమార్, నక్కా దేవేందర్ పాల్గొన్నారు.